పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 110. అన్ నస్ర్ సూరా పరిచయం

మదీనాలో అవతరించింది. 3 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఇది మదీనాలో అవతరించబడిన సూరా. అవతరణా క్రమంలో ఆఖరి సూరా. (సహీహ్ ముస్లిం – హ.నెం.5349) (కితాబుత్తఫ్సీర్) ఈ సూరా అవతరింపజేయబడినప్పుడు కొందరు సహబాలు ఇక దైవప్రవక్త (స) అవసాన కాలం వచ్చేసిందని గ్రహించారు. అందుకోసమే తస్బీహ్ (దేవుని పవిత్రత), తమ్హీద్ (స్తోత్రం) మరియు ఇస్తెగ్ఫార్‌ల ఆదేశం అయింది. సహీహ్ బుఖారీలో హజ్రత్ ఇబ్నె అబ్బాస్, హజ్రత్ ఉమర్ (రజి)ల వృత్తాంతంలో ఉన్నట్లుగా (తఫ్సీర్ సూరతున్ నస్ర్) ఇంకా ఈ సూరా కంటే ముందు సూరయె కాఫిరూన్‌లో జాతి నుండి తెగతెంపులు, తర్వాత హిజ్రత్, తర్వాత యుద్ధ ప్రకటనల సూరా ఉంది. ఇప్పుడు ఈ సూరాలో దైవప్రవక్త (స)కు విజయం లభించనున్న శుభవార్త ఇవ్వబడింది. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలిపారు : హజ్రత్ ఉమర్ (రజి) గారు నన్ను బద్ర్ యుద్ధంలో పాల్గొన్న గొప్ప సహాబీలతో పాటే సభలకు ఆహ్వానించేవారు. కొంతమంది సహాబీలకు నేను రావటం రుచించేది కాదు. ఒకరోజు సమావేశంలో హజ్రత్ ఉమర్ (రజి) అందరినీ ఉద్దేశించి "ఇజాజాఅ నస్రుల్లాహి వల్ ఫత్హ్.." గురించి ఏమనుకుంటున్నారు? అని ప్రశ్నించారు. "విజయం వరించినపుడు దైవస్తోత్రం చేయమని" కొందరు అభిప్రాయపడ్డారు. మరికొందరు మౌనం వహించారు. ఇదే ప్రశ్న నాకు వేయబడినపుడు నేను ఇలా వివరించాను – "ఈ సూరాలో మహాప్రవక్త (స) మరణ కాలం సమీపించిందన్న సంకేతం యివ్వబడింది. దైవసహాయం అంది, మక్కా విజయం కూడా వరించినపుడు (ఓ ముహమ్మద్!) నీవు దైవస్తోత్రం చేయాలి. క్షమాపణకై దైవాన్ని వేడుకోవాలి." ఇదంతా విన్న హజ్రత్ ఉమర్ (రజి) 'నా అభిప్రాయం కూడా అదే' అన్నారు. (సహీహ్ బుఖారీ – హ.నెం.3956)

## 110. అన్ నస్ర్

**ఆయత్‌లు : 3** **అవతరణ : మదీనాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) దైవసహాయం అంది, విజయం లభించినప్పుడు
(2) ప్రజలు గుంపులు గుంపులుగా దైవధర్మంలో చేరుతూ ఉండటాన్ని నీవు చూసినపుడు

(3) నీవు నీ ప్రభువు ప్రశంస మరియు పవిత్రతను వెల్లడించు. ఆయన్ని మోక్షం కోరు. నిస్సందేహంగా ఆయన గొప్పగా క్షమించేవాడు.

آيَاتُهَا 3 ‏ ١١٠ سُورَةُ النَّصْرِ مَدَنِيَّةٌ ‏ رُكُوعُهَا 1

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

إِذَا جَاءَ نَصْرُ اللَّهِ وَالْفَتْحُ ﴿1﴾ وَرَأَيْتَ النَّاسَ
يَدْخُلُونَ فِي دِينِ اللَّهِ أَفْوَاجًا ﴿2﴾ فَسَبِّحْ بِحَمْدِ
رَبِّكَ وَاسْتَغْفِرْهُ ۚ إِنَّهُ كَانَ تَوَّابًا ﴿3﴾ ع 1 3 35

1 – 3 వాక్యాలు

దైవసహాయం అంటే ఇస్లాం మరియు ముస్లింలు కాఫిర్లపై ఆధిక్యత, విజయం, అంటే మక్కా విజయం. దైవప్రవక్త (స) జన్మస్థలం మక్కా నగరం. కాని ఆయనను, సహబాలను తిరస్కారులు అక్కడి నుండి హిజ్రత్ చేయక తప్పని పరిస్థితులను కల్పించారు. అందుచేత హిజ్రీ 8వ సంవత్సరంలో మక్కా విజయం లభించగానే ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి ఇస్లాంలో చేరటం ప్రారంభమయింది. అంతకు పూర్వం ఒక్కొక్కరు ఇద్దరేసి వ్యక్తులు ముస్లింలు అయ్యేవారు. మక్కా విజయం ద్వారా ఆయన (స) నిజమైన దైవప్రవక్త అని ఇస్లాం సత్యధర్మమని ఇంకా ఆ ధర్మం లేకుండా పరలోక మోక్షం సాధ్యంకాదనీ ప్రజలకు స్పష్టమయిపోయింది. అల్లాహ్ సెలవిచ్చాడు, ఇలా అయితే అంటే నీకు అప్పగించబడిన దైవదౌత్య ప్రచార కార్యం పూర్తి అయినప్పుడు ఇక నీవు ప్రపంచాన్నుండి తరలిపోయే సమయం దగ్గర పడింది. అందుచేత స్తోత్రం దైవనామ స్మరణ మరియు ఇస్తగ్ఫార్ విరివిగా చెయ్యి. దీనిని బట్టి జీవితం ఆఖరిదశలో వాటిని విరివిగా చెయ్యాలి అని అర్థమవుతోంది.